Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# విద్యావ్యవస్థలో సంస్కరణలు అవశ్యం

తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడిలో చోటుచేసుకున్న అవకతవకలు 19 మంది విద్యార్థుల ప్రాణాలను బలిగొన్నాయి. ఈ మొత్తం వ్యవహారం కేసీఆర్ ప్రభుత్వానికి మాయని మచ్చగా మిగిలిపోయిందనడంలో సందేహం లేదు. అన్ని వ్యవహారాలూ సాఫీగా సాగుతూ కేసీఆర్‌కు ఎదురు లేదనుకుంటున్న తరుణంలో ఈ విపత్కర పరిణామం చోటుచేసుకుంది. ఒక్కసారిగా రాష్ట్ర ప్రభుత్వంపై పలు వర్గాల నుండి పెద్ద ఎత్తున విమర్శలు ముసురుకుంటున్నాయి. ఇంతటి తీవ్ర పరిణామం చోటు చేసుకుని రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలచివేస్తున్నప్పటికీ రాష్ట్ర పెద్దలెవరూ నోరుమెదపలేకపోవడం సమస్యను మరింత జటిలం చేసింది. నాలుగు రోజుల తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి కొన్ని నివారణ చర్యలు ప్రకటించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన తరువాత పూర్తిగా కకావికలమైన ప్రతిపక్షం తిరిగి తలెత్తుకునేందుకు ఇంటర్మీడియట్ దుస్వప్నం అవకాశం కల్పించింది. బీజేపీ ఒక వైపు దీక్షలు చేస్తుండగా కాంగ్రెస్ కూడా ఆందోళనాపథాన్ని అనుసరిస్తోంది. ఈ వ్యవహారంలో తెలుగుదేశం పార్టీ కొంత స్తబ్ధుగా వ్యవహరించడం విమర్శలకు కారణమవుతోంది. కేసీఆర్‌పై ప్రతి చిన్న విషయానికీ ఒంటికాలిపై లేచే తెలుగుదేశం పార్టీ నాయకులు ఎందువల్లనో ఒకింత సంయమనాన్ని పాటిస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో చోటు చేసుకున్న ఫలితాల పొరపాట్ల నేపథ్యంలో ఇకముందు ఇటువంటి పరిస్థితి ఉత్పన్నం కాకూడదన్న లక్ష్యంతో ఉన్నత విద్యామండలి కొన్ని చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం ముదావహం. పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావడానికి నడుంబిగించడం హర్షణీయం. పరీక్షల నిర్వహణలో జంబ్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నది ఇందులో ముఖ్యమైంది. ఉన్నత విద్యా పరీక్షల్లో కూడా ఇటువంటి విధానాన్నే అనుసరించడం వల్ల సానుకూల ఫలితాలను రాబట్టవచ్చు. ఈసారి పరీక్షా పత్రాల వాల్యూయేషన్‌లో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నట్లుగా ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో నిజానిజాలు పూర్తిస్థాయిలో ఎప్పటికీ వెల్లడికాబోవు. తప్పులు చేసిన వారెవ్వరూ వాటిని అంత తేలికగా అంగీకరించబోరు. వాల్యూయేషన్ చేపట్టే కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం, సెల్‌ఫోన్‌లను నిషేధించడం వంటి చర్యలను ఉన్నత విద్యామండలి ఆలోచిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇది స్వాగతించాల్సిన విషయమే. మార్కులను వేయడంలో అధ్యాపకులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ఈ చర్యలు దోహదం చేస్తాయి. అలాగే యూనివర్సిటీల వారీగా వాల్యుయేషన్, పరీక్షల నిర్వహణ విషయాల్లో మార్గదర్శకాలను రూపొందించే ప్రయత్నాలు కూడా ఉన్నత విద్యామండలి చేస్తున్నట్లు చెబుతున్నారు. వాల్యుయేషన్ విధానంలో కూడా కొన్ని మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో జరిగిన పొరపాట్లను నిర్ధారించడం కష్టమే అయినప్పటికీ పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయడం తక్షణ ఆవశ్యకతగా గుర్తించాలి. అన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు జవాబు పత్రాల జిరాక్స్‌కాపీలను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన కూడా ఉన్నత విద్యామండలి చేస్తున్నట్లుగా వార్తలు సూచిస్తున్నాయి. ఇది ఒకింత కష్టసాధ్యమైన విషయమే. సంక్లిష్టతతో కూడుకున్నదే. ఇందువల్ల లేనిపోని సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా లేకపోలేదు. అయితే జవాబు పత్రాల మూల్యాంకనంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, కచ్చితంగా ఆవేదన చెందే విద్యార్థులకు మాత్రం ఈ చర్య ఉపశమనం కలిగిస్తుందనడంలో సందేహం లేదు. దీనిని ఉన్నత విద్యామండలి ఏ విధంగా అమలు చేస్తుందో వేచి చూడాలి. స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయకపోతే ఫలితాలు వికటించే ప్రమాదం ఎంతైనా ఉంది. విద్యారంగంలో ముఖ్యంగా ఉన్నత విద్యలో సంస్క రణలు తీసుకురావాలన్న డిమాండ్ కొత్తదేమీ కాదు. అనేక సంవత్సరాలు విద్యావంతులు, మేధావులు ఈ విషయాన్ని నొక్కి చెబుతూనే ఉన్నారు. అయితే ప్రభుత్వాల్లో మాత్రం అనుకున్నంత స్థాయిలో కదలిక రావడం లేదు. ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన అనేక సంస్కరణలు సానుకూల ఫలితాలను తీసుకు వచ్చాయి. అవే విధానాలను తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కూడా యథాతథంగా అమలు చేస్తుండడం గమనార్హం. అయితే, జాతీయస్థాయిలో ఇందుకోసం ప్రయత్నాలు జరగడం అత్యంత అవసరం. విద్యాశాఖను చిత్తశుద్ధి, సమర్థత గల వారికి అప్పగించడం వల్ల మాత్రమే సానుకూల ఫలితాలు సంభవిస్తాయి. ఒకవేళ కొన్ని సంస్కరణలు తీసుకు వచ్చినప్పటికీ అవి ఏవిధంగా అమలు జరుగుతున్నాయో పర్యవేక్షించే యంత్రాంగం లేకపోవడం పెద్ద లోపంగా చెప్పి తీరాలి. వివిధ విశ్వ విద్యాలయాలు ఈ విషయంలో గతంలో చేసిన ప్రయోగాలు పెద్దగా సానుకూల ఫలితాలు తీసుకు రాలేకపోయాయి. విద్యార్థులకు, అధ్యాపకులకు ఈ సంస్క రణల విషయంలో సరైన అవగాహన లేకపోవడం కూడా వాటి వైఫల్యానికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఎవరైతే వీటిని అమలు చేయాలో, ఎవరిపైన వీటి అంతిమ ప్రభావం ఉంటుందో వారికి స్పష్టమైన అవగాహన కొరవడితే ఎంతటి ఉన్నత సంస్కరణలైనా విఫలం కావడం తథ్యం. అధికారులు ఏవో కొన్ని సంస్కరణలంటూ ప్రకటనలు చేసి తమ బాధ్యత తీరిపోయిందన్నట్లు చేతులు దులుపుకుంటున్నారు. విద్యారంగంలో నేడు నెలకొన్న దుస్థితికి ఇదే ప్రధాన కారణమని చెప్పక తప్పదు. సంస్కరణల విషయంలో ప్రభుత్వాలకు, విశ్వ విద్యాలయాలకు కొంత చొరవ వచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో ఫలితాలు అందుబాటులోకి రావు. వాటిని అమలు చేసే అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంది. తెలంగాణ ఉన్నత విద్యామండలి పరీక్షల సంస్కరణలకు చేస్తున్న ఆలోచనలు ఎటువంటి ఫలితాలు ఇస్తాయో, వాటి అమలు విషయంలో అధికారులు ఏ మేరకు చిత్తశుద్ధి చూపుతారో వేచి చూడాల్సి ఉంది. ఏమైనా ఒక ప్రయత్నాన్ని ప్రారంభించడం సానుకూల పరిణామంగానే పేర్కొనవచ్చు.